ప్రభాత
jayabheridaily.com
తెలుగు దినపత్రిక

# జయభేరి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

సంపుటి : 01
సంచిక : 139
పేజీలు : 4
వెల : 4

మల్కాజిగిరి
శుక్రవారం, 08-12-2023



జయభేరి దినపత్రిక,
జయభేరి ఛానల్ లో
నిఖార్సైన
జర్నలిస్టులుగా
నిలబడాలను
కుంటున్నారా?
ఆసక్తి కలిగిన యువతి
యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి
ప్రాధాన్యత
email: jayabherinews@
gmail.com,
www.jayabheridaily.com
Call me: 9391 544 889






# రేవంత్ అను నేను

పోరాటాలతో త్యాగాల పునాది మీద ఏర్పడిన తెలంగాణ
అమరవీరుల ఆకాంక్షను నెరవేరుస్తాం
తెలంగాణ సమగ్రాభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం
ప్రగతిభవన్ చుట్టూ ఉన్న కంచెలు బద్దలు కొట్టాము
తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పాటు చేస్తాం
నేడు ఉదయం 10 గంటలకు ప్రజాభవన్లో ప్రజా దర్బార్
మేము పాలకులం కాదు.. ప్రజా సేవకులం
కార్యకర్తలను గుండెల్లో పెట్టి చూసుకుంటా"
ముఖ్యమంత్రిగా తన తొలి ప్రసంగంలో రేవంత్ రెడ్డి

## ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకారం

తెలంగాణ రాష్ట్ర మూడవ ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసారు. రేవంత్ రెడ్డి చే రాష్ట్ర గవర్నర్ తమిళ సై ప్రమాణ స్వీకారం చేయించారు. " ఎనుముల రేవంత్ రెడ్డి అనే నేను. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నా పరిశీలనకు వచ్చిన లేదా నాకు తెలియ వచ్చిన విషయాన్ని, నా కర్తవ్యాలను సక్రమంగా నిర్వహించేందుకు అవసరమైన మేరకే తప్ప ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ ఏ వ్యక్తికీ లేదా వ్యక్తులకు తెలియపరచను లేదా వెల్లడించనని దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను" అని రేవంత్ రెడ్డి ప్రమాణం చేశారు. అనంతరం ప్రమాణస్వీకార పత్రంపై సంతకం చేశారు.

## ఆరు గ్యారంటీలపై మొదటి సంతకం



జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 7 :

తెలంగాణ రాష్ట్ర రెండో సీఎంగా ప్రమాణం చేయనున్న రేవంత్ రెడ్డి తొలి సంతకం ఆరు గ్యారంటీలపైనే పెట్టారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ చాలా హామీలను ఇచ్చింది. వాటన్నింటి కంటే ఆరు గ్యారంటీలు చాలా ప్రధాన పాత్ర పోషించాయి. వాటిని జనాల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ పట్ల ప్రజలకు సానుకూల దృక్పదాన్ని కలిగించారు నేతలు. అందుకే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలపైనే సంతకాలు పెడతామని ప్రతి మీటింగ్లోనూ నేతలంతా చెప్పారు.

**మహాలక్ష్మి :** 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలక 2500 రూపాయల డబ్బులు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. భారీగా పెరిగిపోయిన గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించేందుకు కూడా తాము కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చింది. ఇందులో భాగంగా గ్యాస్ సిలిండర్ ఐదు వందల రూపాయలకే ఇవ్వబోతున్నట్టు ప్రకటించారు. దీంతోపాటు ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం హామీ కూడా బలంగా ప్రజల్లోకి వెళ్లింది.

**రైతు భరోసా ప్రతి ఏటా :** రైతులకు, కౌలు రైతులకు ఏకరానికి


మిగతా 2 లో


## కొత్త కేబినెట్ లో మంత్రులు. ప్రొఫైలు



జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 7

తెలంగాణలో కొత్త కేబినెట్ కొన్ని గంటల్లో కొలువు దీరనుంది. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న రేవంత్ రెడ్డి.. మంత్రి వర్గంలో 11 మందికి చోటు కల్పించారు. పార్టీలో సుదీర్ఘకాలంగా పని చేస్తున్న నేతలకు ప్రాధాన్యత ఇచ్చారు. మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ గౌడ్, నల్గొండ నుంచి గెలుపొందిన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వరంగల్ ఈస్ట్ నుంచి గెలుపొందిన కొండా సురేఖతోపాటు మరికొందరు సీనియర్లను తన టీంలోకి తీసుకున్నారు.

మల్లు భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గంలో నుంచి నాల్గో సారి విజయం సాధించారు. ఖమ్మం జిల్లాలోని వైరా మండలంలోని స్నానాల లక్ష్మీపురం మల్లు భట్టి విక్రమార్క స్వగ్రామం. హైదరాబాద్లోని నిజాం కళాశాల నుంచి గ్రాడ్యుయేషన్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం నుంచి పీజీ పూర్తి చేశారు. 2009లో తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2009లో చీఫ్ విప్గా పని చేశారు. అంతకు ముందు ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2011న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్గా పని చేశారు. 2014లో మధిర నియోజకవర్గం నుంచి రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2018లో మధిర నుంచే మూడోసారి గెలుపొందారు. 2019 నుంచి CLP లీడర్గా ఉన్నారు. మంథని నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. మాజీ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాద రావు, జయమ్మ దంపతులకు 1969 మే 30న జన్మించారు. ఐఏఎస్


మిగతా 2 లో


## బద్దలైన ప్రగతి భవన్



జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 7

పదేళ్లుగా తెలంగాణ సీఎం అధికారిక నివాసంగా ఉన్న ప్రగతి భవన్లో మార్పులు చేర్పులు జరుగుతున్నాయి. ఇప్పటికే దీన్ని అంబేద్కర్ ప్రజా భవన్గా పేరు మార్చారు. సామాన్యులకి కూడా ఆ ప్రజాభవన్లోకి ప్రవేశం ఉంటుందని ప్రకటించారు. అందులో భాగంగా ప్రగతి భవన్ వద్ద మార్పులు చేర్పులు చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నన్ని రోజులు ప్రగతి భవన్ అనేది తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అధికారిక కార్యాలయం, నివాసంగా ఇప్పటి వరకు ఉండేది. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో దాన్ని ప్రజాభవన్గా మార్చేస్తున్నారు. ఇది హైదరాబాదులోని పంజాగుట్టలో ఉంది. ఇండియాలోనే టాప్ ఆర్కిటెక్చర్ హఫీజ్ కాంట్రాక్టర్


మిగతా 3 లో


## జయభేరి అక్షర తూటా



ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని
అప్పుల పాలు చేసింది గత ప్రభుత్వం...

సరికొత్త ఆశలతో ప్రజాస్వామిక పాలన చేపడదామని
వచ్చిన కాంగ్రెస్కు షాక్ తగలనుందా!?

అయినా...
ఇన్ని ఉచిత పథకాలు అందిస్తే రేపు రాష్ట్రం ఏమైపోనూ!?

అసలు ఈ మేధావులు చదువుకున్న వారు
ఉచిత పథకాలు ఎక్కువగా అందివ్వద్దు ప్రజల్ని
అసమర్థులు చేయొద్దు అంటున్నారు సార్...
ఏం చేద్దాం ముఖ్యమంత్రి గారు...

...కడారి శ్రీనివాస్
సీనియర్ జర్నలిస్ట్

మీ మాటల తూటాలను మాకు పంపండి...
మా 'జయభేరి అక్షర తుటా' తో జతవుతుంది.
+91 9391 544 889

'జయభేరి' కౌంటర్ విత్ కడారి కామెంట్స్ ... 2 లో





## ఆడవాళ్లకు వరం


2 లో




## జనం ప్రేమ గెలుచుకున్న కొండ దొరసాని


4 లో

jayabheridaily.com
ప్రభాత జయభేరి

▶▶ మొదటిపేజీ తరువాయి

## రేవంత్ అను నేను..

రేవంత్రెడ్డి సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. ఎల్బీ స్టేడియంలో కిక్కిరిసిన జనసందోహం, అగ్రనేతల సమక్షంలో రేవంత్తో ప్రమాణం చేయించారు గవర్నర్ తమిళిసై. రేవంత్ ప్రమాణం స్వీకారం తర్వాత మరో 11 మంది మంత్రులు వరుసగా ప్రమాణస్వీకారం చేశారు. వారితో గవర్నర్ తమిళిసై రాజ్యాంగబద్ధంగా ప్రమాణం చేయించారు. సీఎంతోపాటు డిప్యూటీ సీఎంగా భట్టి, మంత్రులుగా కొండా సురేఖ, సీతక్క, శ్రీధర్బాబు, కోమటిరెడ్డి వెంకట్రెడ్డి, ఉత్తమ్, జూపల్లి, పొంగులేటి, తుమ్మల, రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ ప్రమాణం చేశారు.రేవంత్రెడ్డి ప్రమాణస్వీకారానికి AICC అగ్రనేతలు సోనియా, రాహుల్, ఖర్గే, ప్రియాంకతోపాటు కీలక నేత కేసీ వేణుగోపాల్, హిమాచల్ గవర్నర్ సుఖ్విందర్సింగ్ హాజరయ్యారు. రేవంత్ అను నేను అంటూ సీఎంగా రేవంత్ రెడడి ప్రమాణం చేస్తుండగా సభా ప్రాంగణం జయజయధ్వానాలతో మార్మోగింది. అభిమానులు ఈలలు, కేకలతో హోరెత్తించారు. ప్రమాణ స్వీకారం అనంతరం సీఎం రేవంత్రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఒకరినొకరు కౌగిలించుకుని ప్రజలకు అభివాదం చేశారు.ప్రమాణస్వీకారోత్సవ వేదికపై రేవంత్రెడ్డి కుటుంబసభ్యులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రేవంత్ భార్యతోపాటు కూతురు, అల్లుడు, మనువడు హాజరయ్యారు. రేవంత్రెడ్డి ప్రమాణస్వీకారోత్సవంతో ఎల్బీ స్టేడియం పరిసరాలు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులతో కిక్కిరిసిపోయాయి. కళాకారుల డప్పుదరువులు, ఆటపాటలు, మహిళలు బోనాలతో రావడంతో స్టేడియం సందడిగా మారింది. ఎల్బీ స్టేడియం ముందు లంబాడీ వేషధారణలో మహిళలు నృత్యాలతో ఆకట్టుకున్నారు. వేపమండలతో చిన్నారుల డ్యాన్సు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మంత్రులందరూ ప్రమాణ స్వీకారం తర్వాత సోనియా, రాహల్ గాంధీలతో పాటు ముఖ్య నేతలందరికీ నమస్కరించారు. అయితే అందరూ సీతక్కకు ప్రత్యేక గౌరవం ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ..సోనియా లేచి నిలబడి.. ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని మాట్లాడారు. రాహుల్ గాంధీతో పాటు ప్రియాంక కూడా సీతక్కను ప్రత్యేకంగా అభినందించారు. కాంగ్రెస్ లో చేరిన తర్వాత సీతక్క పార్టీ కష్టపడ్డారు. భారత్ జోడో యాత్రలో కూడా కీలక పాత్ర పోషించారు. మహిళా కాంగ్రెస్ కీలక బాధ్యతల్లో ఉన్నారు. పైగా ఆమె నక్సల్ ఉద్యమం నుంచి ప్రజా రాజకీయాల్లోకి వచ్చారు. అందుకే.. సీతక్కపై అందరూ ప్రత్యేకమైన గౌరవం చూపించారు. ఆమె ప్రస్థానం స్ఫూర్తిదాయకంగా ఉండటం వల్ల ప్రతి సందర్భంలోనూ సీతక్క ప్రత్యేకంగా నిలుస్తున్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఏఐసీసీ అగ్రనేతలందరూ తరలి వచ్చారు. ఏఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, రాహల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు కాంగ్రెస్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు.. ఇతర నేతలు కూడా తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఎల్బీ స్టేడియం కిక్కిరిసిపోయింది. ముఖ్యమైన నేతలందరూ తరలి రావడంతో హైదరాబాద్ మొత్తం సందడిగా మారింది. ముందుగా పార్టీ అగ్రనేత సోనియాగాంధీతో కలిసి ప్రత్యేక వాహనంలో రేవంత్ వేదిక వద్దకు చేరుకున్నారు. కాంగ్రెస్, ఇతర పార్టీలకు చెందిన ముఖ్యనేతలు ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు రాహుల్గాంధీ, ప్రియాంకతో పాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మాజీ సీఎంలు, సీనియర్ నేతలు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున కాంగ్రెస్ ముఖ్యనేతలు, కార్యకర్తలు తరలివచ్చారు. తెలంగాణ నూతన స్పీకర్గా వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్కుమార్ను కాంగ్రెస్ అధిష్ఠానం ఎంపిక చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి సీఎం కిరణ్కుమార్రెడ్డి హయాంలో ఆయన మంత్రిగా పనిచేశారు. తాజాగా ఆయన్ను స్పీకర్గా ఎంపిక చేస్తూ కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుంది.

## ఆరు గ్యారంటీలపై మొదటి సంతకం

15000 రూపాయల రైతుల భరోసాను ఇస్తామని కాంగ్రెస్ మ్యానిపెస్టోలో పెట్టింది. దీంతోపాటు వ్యవసాయ కూలీలకు 12000 రూపాయలు ఇస్తామని పేర్కొంది. వరి పంటకు క్వింటాకు 500 రూపాయల బోనస్ ఇవ్వబోతున్నట్టు హామీ ఇచ్చింది.

**గృహ జ్యోతి :** గృహజ్యోతి పథకాన్ని ప్రవేశ పెట్టి ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల విద్యుత్తు ఉచితంగా ఇస్తామని భరోసా ఇచ్చింది.

**ఇందిరమ్మ ఇండ్లు :** ఇల్లు లేని వారికి ఇంటి స్థలం ఇచ్చి ఐదు లక్షల రూపాయలు ఇచ్చి ఇళ్లు కట్టుకునేలా ప్రోత్సహిస్తామని పేర్కొంది. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు వారి కుటుంబాలకు 250 చదరపు గజాల ఇంటి స్థలం ఇస్తామని గ్యారంటీ ఇచ్చింది.

**యువ వికాసం :** విద్యార్థులకు ఐదు లక్షల విద్యా భరోసా కార్డులు ఇవ్వాలని నిర్ణయించింది. ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుకు హామీ ఇచ్చింది.

**చేయూత :** చేయూత పథకం కింద ప్రస్తుతం ఇస్తున్న పింఛన్లను 4000 వేలకు పెంచబోతున్నట్టు తెలిపారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ బీమా ను కూడా 10 లక్షలు చేయబోతున్నట్టు వెల్లడించారు. వీటితోపాటు ప్రతి జిల్లాకు ప్రత్యేక డిక్లరేషన్ ఇచ్చారు. ఇలా భారీ హామీలను కాంగ్రెస్ పార్టీ ఇచ్చింది. వీటి అమలుపైనే ప్రధానంగా దృష్టి పెట్టబోతున్నట్టు కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు . ప్రతి బహిరంగ సభలో ఏఐసీసీ అగ్రనేతలు పాల్గొన్న అన్ని ప్రచార కార్యక్రమాల్లో ఈ ఆరు గ్యారంటీలపైనే ప్రధానంగా ఫోకస్ పెట్టారు. అందుకే ఈ ఆరు గ్యారంటీలను మొదటిగా అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది.

## కొత్త కేబినెట్ లో మంత్రులు.. ప్రొఫైలు

అధికారి శైలజ రామయ్యర్తో వివాహం జరిగింది. మంథని నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఉమ్మడి ఏపీలో పౌర సరఫరాలు, శాసన వ్యవహారాల మంత్రిగా పని చేశారు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో న్యాయ విద్యను అభ్యసించారు. 1998లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా కూడా పేరు నమోదు చేసుకున్నారు. తండ్రి శ్రీపాదరావు హత్యతో 1999లో రాజకీయాల్లో వచ్చారు శ్రీధర్బాబు. 1999 శాసనసభ ఎన్నికల్లో మంథని నుంచి మొదటి సారిగా గెలుపొందారు. 2004, 2009, 2018, 2023 మంథని నుంచి విజయం సాధించారు. 20042019 వరకు ప్రభుత్వ చీఫ్ విప్ కూాడ ఉన్నారు. 20102014 వరకు కిరణ్కుమార్ రెడ్డి కేబినెట్లో శాసన సభ వ్యవహారాల మంత్రిగా, 200910 వరకు ఉన్నత విద్య, ఎన్నారై వ్యవహారాల మంత్రిగా విధులు నిర్వహించారు. 2014లో మేనిఫెస్టో కమిటీ ఛైర్మన్ గా ఉన్నారు. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

పొన్నం ప్రభాకర్ గౌడ్ 1967 మే 8న జన్మించారు. తల్లిదండ్రుల పేర్లు సత్తయ్య మల్లమ్మ. 2000 ఏప్రిల్ 21న మంజులతో వివాహం జరిగింది. ఉస్మానియా యూనివర్సిటీలో బిఏ, ఎల్ఎల్బి పూర్తి చేశారు. 2009లో కరీంనగర్ పార్లమెంట్ నుంచి తొలిసారిగా పోటీ చేసి విజయం సాధించారు. అత్యంత పిన్న వయస్సులో ఎంపీగా ఎన్నికైన నేతగా పొన్నం పేరు మీద రికార్డు ఉంది. విద్యార్థి ఉద్యమకారుడిగా రాజకీయ ప్రయాణం ప్రారంభించారు. 2022 డిసెంబర్ 10న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడుగా కూడా ఉన్నారు. 2023లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ కమిటీ చైర్మన్ గా ఉన్నారు. 2014, 2019 ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ అసెంబ్లీ నుంచి ఓటమి పాలయ్యారు. 2023 తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి విజయం సాధించి ఇప్పుడు మంత్రి అవుతున్నారు.

కొండా సురేఖ తెలంగాణ రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్గా పేరు తెచ్చుకున్న నేత.1965 ఆగస్ట్ 19న జన్మించారు. 1995లో మండల పరిషత్కు ఎన్నికల్లో విజయం సాధించి సంచలనంగా మారారు. 1996లో పీసీసీ సభ్యురాలుగా పని చేశారు. 1999లో శాయంపేట నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2000లో ఏఐసీసీ సభ్యురాలిగా నియమితులయ్యారు. 2004లో శాయంపేట నుంచి రెండో సారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009లో పరకాల నుంచి అసెంబ్లీకి మూడోసారి ఎన్నికయ్యారు. 2009లో వైఎస్ కేబినెట్లో మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా పని చేశారు. 2011లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన సురేఖ జగన్ వెంట నడిచారు. 2013లో వైసీపీకి రాజీనామా చేశారు. 2014 ఎన్నికల్లో వరంగల్ తూర్పు నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా నాలుగోసారి విజయం సాధించారు. 2018లో బీఆర్ఎస్కు రాజీనామా, కాంగ్రెస్లో చేరారు. 2023లో వరంగల్ తూర్పు నుంచి ఎమ్మెల్యేగా ఐదోసారి గెలుపొందారు.

కోమటిరెడ్డి వెంకట్రెడ్డి కాంగ్రెస్లో కీలకమైన నేతల్లో ఒకరు. 1963 మే 23న జన్మించిన ఈయన ఎన్ఎస్యూఐ ద్వారా రాజకీయాల్లోకి వచ్చారు. 1999, 2004, 2009, 2014 ఎన్నికల్లో విజయం సాధించారు. నల్గొండ స్థానం నుంచి వరుసగా 3 సార్లు విజయం సాధించిన తొలి సభ్యుడయ్యారు.

వైఎస్, రోశయ్య మంత్రివర్గాల్లో ఐటీ, యువజన సర్వీసులు, క్రీడల మంత్రిగా కూడా పని చేశారు. కిరణ్ కుమార్ రెడ్డి మంత్రివర్గంలో మౌలిక వసతులు, పెట్టుబడులు శాఖల మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో 2011 అక్టోబరు 5న మంత్రి పదవికి రాజీనామా చేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసి ఓటమి పాలయ్యారు.

# ఆడవాళ్లకు వరం మగవాళ్లకు శాపమా..!

**పది సంవత్సరాల తర్వాత తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది.. మంత్రివర్గం కూడా ఏర్పాటయింది.. ఇక్కడే ఇప్పుడు మనం విశ్లేషణ చేసుకునే అంశం. మొదటి సంతకాన్ని ఆరు గ్యారెంటీ ల మీద ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి సంతకాన్ని చేశారు.. మహిళలకు బస్సుల్లో ఫ్రీ అనేది తక్షణమే అమలవుతుందని హోం శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మీడియా సమావేశంలో చెప్పారు.. ఇదే విషయంపై సీనియర్ జర్నలిస్ట్ కొమ్ము రాజేందర్, సామాజిక ఉద్యమకారుడి సరికొత్త విభిన్నమైన కథనం.. ఓ లుక్ వెయ్యండి..**



**జయభేరి, హైదరాబాద్ :**
తెలంగాణ రాష్ట్రానికి రెండవ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఎనుముల రేవంత్ రెడ్డి మొదటి సంతకాన్ని ఆరు గ్యారెంటీల పథకంపై చేశారు... అంత బాగానే ఉన్నా మహిళలకు ఆర్టీసీ బస్సులు ఉచిత ప్రయాణం పైన ఇప్పుడు సర్వత్ర చర్చాంశ నీయం అవుతుంది... తెలంగాణ రాష్ట్రంలో ఉన్న మహిళలందరికీ రాష్ట్రంలో ఎక్కడికి వెళ్ళినా టికెట్టు లేకుండా ప్రయాణించే ఒక ఉచిత పథకాన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో పేర్కొంది... అయితే ఇదే విషయంపై భార్య బాధితుల సంఘం లోని సభ్యులు పలువురు మరి మా సంగతి ఏంటి అనే ప్రశ్నను లేవనెత్తుతున్నారు!?

మహిళలకు అన్ని వరాలు అందిస్తే మగవారిగా పుట్టి మేము శాపం చేశామ!? పాపం చేసామ!? అంటూ తమ అభిప్రాయాలను బాగాటంగానే వెలిబుచ్చుతున్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఇస్తే మరి మాకు ఏమి ఇస్తారు అంటూ మొండి పట్టు పడుతున్నారు భార్యా బాధితుల సంఘం లోని సభ్యులు... మహిళలకు 2500 ఆర్టిసి బస్సులో ఉచిత ప్రయాణం విద్యార్థులకు స్కూటీలు ఇలా అన్ని ఆడపిల్లలకి ఇస్తే మగవారిగా మరి మేమేం పాపం చేశామంటూ భార్య బాధితుల సంఘం సభ్యులు పత్రిక ముఖంగా తమ గోడును విన్నవించుకుంటున్నారు.. నిజానికి మహిళల పట్ల గౌరవం ఉంచే ఏ ప్రభుత్వమైనా కచ్చితంగా వారిని గౌరవించే పథకాలను ప్రవేశపెట్టాలి. వాటిలో ఎటువంటి సందేహం లేదు ఆర్టీసీ బస్సుల్లో మహిళలనే కూర్చోబెట్టాలి వారి సీట్లు కూర్చొనియద్దు అని రాస్తారు.. క్యూలైన్లో నిలబడ్డ ముందుగా మహిళల కే అంటూ వారిని ప్రోత్సహిస్తారు.. ఎక్కడ చూసినా వారికే మొదటి స్థానం ఉంటుంది.. మరి మగవారిగా పుట్టిన మా పరిస్థితి ఏంటి అని వాపోతున్నారు వినూత్న నిరసన కార్యక్రమాలకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.. వాస్తవానికి తెలంగాణ రాష్ట్రంలో ఉన్న నాలుగున్నర కోట్ల కు పైగా జనంలో సగం మంది మహిళలే ఉంటారు. అలాంటి మహిళలందరికీ ఆర్టీసీ బస్సులు ఉచిత ప్రయాణం అంటే ఆర్టీసీ ఉంటుందా ఊడుతుందా అనే సందేహం కూడా వస్తుందని తమ సందేహాల్ని వ్యక్తం చేస్తున్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి మాకేం సంబంధం లేదు మరి మమ్మల్ని ఎందుకు వేరు చేస్తూ మాపై కోపాన్ని ఎందుకు చూపిస్తున్నారు అంటూ ప్రాధేయపడుతున్నారు. నిజానికి మద్యపానం వలన మా ఆరోగ్యాలు పాడు చేసుకుంటూ ప్రభుత్వానికి ఖజానా నింపుతున్న, మమ్మల్ని చీపురు పుల్ల కంటే హీనంగా చూసేవారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుందని, ఇంకా మహిళల్ని ప్రోత్సహిస్తూ వారికే ఉచిత పథకాలు అందిస్తూ పోతే మగవారిని మహిళలు లెక్క చేస్తారా ఇప్పటికే మా పరిస్థితి భార్య బాధితుల సంఘం అని ఏర్పాటు చేసుకొని మా సమస్యలు మేమే చక్కదిద్దుకునే ప్రయత్నం చేస్తున్న ఈతరణలో ఆడవారికి అన్ని ఫ్రీ అంటే మరి మా పరిస్థితి ఏంటి!? అని తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు.. అయ్యా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు మరి మాకు మద్యపానం వయసుకు తగ్గ అర్హతను బట్టి ఫ్రీగా ఒక క్వార్టర్ బాటిల్ అందించమని ప్రాధాయపడుతున్నారు.. పోయిన ప్రభుత్వంలో యదేచ్ఛగా మద్యపానాన్ని సేవించి ప్రభుత్వానికి ఖజానా నింపినం.. ఇప్పుడు మాకు ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఫ్రీగా ప్రయాణం చేసేట్టుగా అవకాశం కల్పిస్తున్న ఇతరులను మాకు పొద్దంతా చేసిన కష్టం మర్చిపోవడానికి ఒక కోటర్ బాటిల్ అందిస్తే బాగుంటుంది అని ప్రభుత్వాన్ని విన్నవించుకుంటున్నారు... ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఫ్రీ మద్యపాన దుకాణాల్లో మగవారికి అర్హతను బట్టి కోతలు బాటిల్ ఫ్రీ పెడితే హాయిగా సంతోషంగా మా పని మేము చేసుకుంటూ మళ్లొచ్చే ఎన్నికల్లో మళ్లీ మీకే ఓటేస్తాం అని శపదాన్ని కూడా చేస్తున్నారు... ఇలాంటి తరుణంలో ప్రభుత్వం ఇచ్చిన హామీని వెనక్కి తీసుకోలేక ఇలా భార్యా బాధితులు సంఘం సభ్యులు అడిగే కోరికలు తీర్చలేక మరి ఏం చేస్తుందో ఏంటో వేచి చూడాల్సిందే... నిజానికి తెలంగాణ రాష్ట్రంలో ఫ్రీ ఉచిత పథకాలు అంత మంచివి కావు... విద్య ఉపాధి నిరుద్యోగం వీటిని తగ్గించడానికి సులువైన మార్గాలను ఎంచుకొని రైతుకు చేయూతనందించే విషయంలో ముందుకు నడిచి వయసు మళ్ళిన వృద్ధులకు ఒంటరి మహిళలకు పింఛన్లను అందజేస్తూ విద్యార్థులకు ఉచిత పుస్తకాలు అందిస్తే సరిపోతుందని వారికి ఇవి చాలదన్నట్టు అనేక సంక్షేమ పథకాలలో వారిని ముందు పెట్టి మమ్మల్ని వెనక్కి నెట్టివేయడం మేము చేసిన నేరం ఏంటని? బాహాటంగానే ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి వారిని ప్రభుత్వం గుర్తించి భార్య బాధితుల సంఘం సభ్యులను పరిగణలోకి తీసుకొని వారి సమస్యలు కూడా తీర్చితే రాబోయే రోజులలో ప్రతి మనిషికి కూడు గూడు తిండి బట్ట వీటితోపాటు కాస్త మద్యపానం కూడా ఫ్రీగా అందిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు... తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్న నాటినుండి 10 సంవత్సరాల నుండి ఒక్కరు తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చలేదు కానీ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అడుగు పెట్టిందో లేదో ఇలాంటి వినూత్నమైన సమస్యలతో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వాన్ని రికార్డులో పెట్టాలని ఇలాంటి సమస్యలను తీసుకొస్తున్నారు ఏమో తెలియదు కానీ వాస్తవానికి ఫ్రీ ఉచితం పథకాలు అంత మంచివి కావు...

ఆర్టీసీ సంస్థ ఇప్పటికే అప్పుల్లో కురుకుపోయి ఉన్న తరుణంలో వారిని గవర్నమెంట్ కింద లెక్క కట్టింది గత ప్రభుత్వం.. అలాంటి గవర్నమెంట్ ఆర్టీసీకి నష్టం వాటిల్లకుండా సాధ్యసాధ్యా లను పరిశీలించి, ఇంతవరకు వర్కౌట్ అవుతుందో పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని అలాగే మగవారికి కూడా మంచి మంచి సౌకర్యాలు కల్పించాలని భార్య బాధితుల సంఘం సభ్యులు కోరుకుంటున్నారు....





...కొమ్ము రాజేందర్
సీనియర్ జర్నలిస్ట్ సామాజిక ఉద్యమకారుడు
84989 20848

# జర్నలిస్టుల పై దాడులు చేసిన వారిపై కేసు నమోదు

- **మేకల భార్గవ్, అనుచరుడు కాశీ దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసిన శామీర్ పేట్ పోలీసులు**

**జయభేరి, డిసెంబర్ 7 :-**
విలేకరిపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై శామీర్ పేట్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల శామీర్ పేట్ లో జరిగిన కురమ కులస్తుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఓ విలేకరిపై దాడి జరిగిన విషయం తెలిసిందే. కురుమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన (మంత్రి మల్లారెడ్డి ప్రచార కార్యక్రమం) సమావేశానికి జవహార్ నగర్ కార్పోరేషన్ మేయర్ మేకల కావ్య , తండ్రి అయ్యప్ప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శామీర్ పేట్ సెలబ్రిటీ రిసార్ట్లోని ఖాళీ స్థలంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎలాంటి అనుమతులు లేకుండా అప్పటి మంత్రి చామకూర మల్లారెడ్డికి సంబంధించిన కళాశాలల బస్సులలతో పెద్ద ఎత్తున జనసమీకరణ, మంత్రి మల్లారెడ్డి అనుచరులతో విందు ఏర్పాటు చేసిన విషయం తెలుసుకున్న కొందరు శామీర్ పేట్ విలేకరులు అక్కడికి వెళ్ళారు. అదే సమయంలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు కూడా అక్కడికి చేరుకున్నారు. ఎన్నికల సమయంలో అనుమతులు లేకుండా ఇలాంటి సమావేశాలు నిర్వహించరాదని హెచ్చరించారు. అయినా వారి మాటలు పట్టించుకోకుండా సుమారు రెండు వేలకు పైగా జనంతో సజావుగా సమావేశం నిర్వహించారు. అయితే సమావేశంలో జవహర్ నగర్ మేయర్ కావ్య, తన తండ్రి అయ్యప్ప, తోటి అనుచరులు మేడ్చల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చామకూర మల్లారెడ్డికి కురుమ కులస్తులు అందరూ ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని, ఇదంతా ఎమ్మెల్యే అభ్యర్థి మల్లారెడ్డి ఏర్పాటు చేసిన సమావేశమేనని తేల్చి చెప్పారు. ఇంతలో అక్కడ ఉన్న కొందరు కురుమ సంఘం నాయకులు కురుమ కులస్తుల ఆత్మీయ సమ్మేళనం అని చెప్పి మల్లారెడ్డికి ఓటు వేయమనడం ఎంతవరకు సమంజసమని వాగ్వివాదానికి దిగారు. మాటా మాటా పెరిగి ఆత్మీయ సమ్మేళనం కాస్తా రాజకీయ సమావేశం కావడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సమావేశంలో కూర్చున్న జనం కాస్తా కూర్చీలు ఎత్తి కొట్టుకునే స్థాయికి చేరింది. అక్కడే ఉన్న విలేకరులు కొందరు అక్కడి సన్నివేశాలు చిత్రీకరిస్తుండగా ఓ విలేకరిపై కొందరు విరుచుకుపడ్డారు. మేము నిర్వహించుకుంటున్న సమావేశంలో మీకేం పని అని, విలేకరులైతే ఏంపీ... ని దుర్భాషలాడారు. అంతటితో ఆగకుండా విలేకరి ఫోన్ లాక్కొని అతన్ని





నెట్టివేశారు. వారంతా ఒక్కసారిగా విలేకరిపై దాడికి పాల్పడుతూ నోటికి వచ్చినట్లుగా దుర్భాషలాడారు. దీంతో దిక్కుతోచని స్థితిలో అక్కడి నుండి విలేకరులు నేరుగా శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ కు వచ్చి జరిగిన విషయాన్ని ఆధారాలతో సహా పోలీసులకు వివరించి, ఫిర్యాదు చేశారు. ఎన్నికల నేపథ్యంలో హడావిడిగా ఉన్న పోలీసులు ఫిర్యాదు స్వీకరించి, కోర్టు అనుమతులతో మంగళవారం కేసు నమోదు చేశారు. దాడికి పాల్పడిన మేకల భార్గవ్, కాశిలపై సెక్షన్ 323, 506 కింద కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. విలేకరిపై దాడికి పాల్పడిన కేసులో నిందితులను రిమాండ్ కు తరలించి కోర్టుకు హాజరు పరుస్తామని శామీర్ పేట్ ఎస్ఐ మునింధర్ తెలిపారు. విలేకరులు చేసిన ఫిర్యాదుపై వెంటనే చర్యలు తీసుకున్న శామిర్ పేట్ పోలీసుల పనితీరుకు శామీర్ పేట్ , మేడ్చల్ జిల్లా విలేకరులు హర్షం వ్యక్తం చేశారు.

# డోర్ టూ డోర్ దోమలు మందులు పిచికారి

- **పీర్జాదిగూడలో దోమల నివారణకు ఆక్షన్ ప్లాన్**

**జయభేరి, మేడిపల్లి :**
పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ పరిదిలో దోమల నియంత్రణకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.26 వార్డులో ప్రతి ఇంటికి వెల్లి డోర్ టూ డోర్ దోమలు మందులు పిచికారి చేస్తున్న విధానాన్ని మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కమీషనర్ ఇస్లావత్ నమ్య పరిశీలించారు. మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ... ఇంటి లోపల గోడలపై పిచికారీ చేసే దోమల మందు సింజెంట వారి ఐకాన్ (Syngenta ICON) క్రిమి సంహారక మందు వల్ల ఆరోగ్య పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగవని, ఈ మందు ద్వారా ఇంట్లోకి దోమలు రాకుండా నివారించ వచ్చని, మందు పిచికారి చేసిన ప్రదేశాలలో నీటితో కడగటం వంటివి చేయడం ద్వారా మందు ప్రభావం తగ్గుతుందని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత దోమల నివారణకు దోహద పడుతుందని అన్నారు. ప్రజలు గృహాలలో ఉన్న నీటి నిల్వలను అంటే పూల కుండీలు నీటి పాత్రలు, చెట్ల ఆకులు, కిటికీల సన్షేడ్లు, టైర్లు, ఇతర డంప్ చేయబడిన కంటైనర్లు & మెటీరియల్స్, స్తబ్దుగా ఉన్న డ్రైన్ పాయింట్లు, కూలర్లులలో నిల్వ ఉన్న నీళ్లు తీసివేయడంతో పాటు నిత్యం శుభ్రంగా ఉంచాలని ప్రజలకు విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో RO శ్రీనివాస్ రెడ్డి, వార్డ్ ఆఫీసర్లు, శానిటేషన్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# కన్నులపండువగా పడిపూజ కార్యక్రమం

- **పెద్దసంఖ్యలో హాజరైన అయ్యప్ప స్వాములు, భక్తులు**

**జయభేరి, సూర్యాపేట :**
అయ్యప్ప స్వామి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై వుండాలని అయ్యప్ప స్వామి ఆలయం చైర్మన్ బెలిదె శ్రీనివాసులు అన్నారు. ఉత్తర నక్షత్ర సందర్భంగా సూర్యాపేటలోని అయ్యప్ప స్వామి ఆలయం నందు బుధవారం సాయంత్రం పడిపూజ కార్యక్రమం కన్నులపండువగా నిర్వహించారు. దాదాపుగా ఐదు గంటల పాటు అయ్యప్ప స్వాముల శరణ ఘోషల మధ్య పడిపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బెలిదె శ్రీనివాసులు మాట్లాడుతూ ఆలయం నందు దాతల సహకారంతో కార్తీక మాసం మొదటి రోజు నుండి 800 మంది అయ్యప్ప స్వాములకు ప్రతిరోజూ అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. శబరి నగర్ అయ్యప్ప స్వామి దేవాలయం నందు ఈ సంవత్సరం 3500 మంది స్వాములు మాలధారణ చేశారని చెప్పారు. బుధవారం రోజు ఉదయం స్వామి వారి మూలవిరాట్ కు పంచామృత అష్టద్రవ్య అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం అయ్యప్ప స్వాములకు సుమారుగా 800 మందికి అన్నప్రసాద వితరణ నిర్వహించారు. అన్నదానం దాత గోరుగంటి రవింద్రరావు దంపతులచే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గురుస్వాములు, అయ్యప్ప స్వాములు, ఆలయ ప్రధాన కార్యదర్శి ఎల్గూరి రాంబాబు, కోశాధికారి బచ్చు శ్రీనివాస్, మనసాని రామ్మూర్తి, జెపిటి గురుస్వామి, గొట్టిముక్కల శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






# కాంగ్రెస్ ద్వారానే అభివృద్ధి సాధ్యం కాంగ్రెస్ యూత్ వర్కింగ్ అధ్యక్షుడు నవీన్


**జయభేరి, డిసెంబర్ 7:**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గా ఎనుముల రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ఆయనకు మూడు చింతలపల్లి మండల కాంగ్రెస్ వర్కింగ్ యూత్ అధ్యక్షుడు నవీన్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి గా బాధ్యతలు చేపట్టడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆయన నాయకత్వం లో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. అంతే కాకుండా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ పార్టీ తూచా తప్పకుండా నెరవేరుస్తుందని తెలిపారు. నూతన కాంగ్రెస్ ప్రభుత్వానికి పార్టీ కార్యకర్తలందరు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు.

# మహిళా వికలాంగురాలు రజనీకి తొలి ఉద్యోగం

- **నియామక పత్రం అందజేసిన సీఎం రేవంత్ రెడ్డి**

**జయభేరి, హైదరాబాద్ :**
తెలంగాణ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేసిన సీఎం రేవంత్ రెడ్డి తాను ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటలను నిలబెట్టుకున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను తప్పక అమలు పరిచే అభయ హస్తంపై తొలి సంతకం చేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి దివ్యాంగురాలైన రజినికి ఉద్యోగం ఇస్తానని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. సీఎంగా రేవంత్ రెడ్డి రజిని ఉద్యోగ నియామక ఫైల్పై రెండో సంతకం చేశారు. అనంతరం ఉద్యోగ నియా మక పత్రాన్ని దివ్యాంగురాలైన రజినికి అందజేశారు. అలాగే జ్యోతిరావు పూలే ప్రజా భవన్ ప్రగతి భవన్లో శుక్రవారం ఉదయం 10గంటలకు ప్రజా దర్బార్ నిర్వహిస్తామని అన్నారు. దానికి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.





# బద్దలైన ప్రగతి భవన్

ఆధ్వర్యంలో ఈ భవనాన్ని నిర్మించారుతెలంగాణ సీఎంగా కేసీఆర్ ఉన్నప్పుడు ఆయన విధులు నిర్వహించేందుకు ఈ భవనాన్ని నిర్మించారు. అంత వరకు ఇక్కడ అధికారుల క్వార్టర్స్ ఉండేది. దాన్ని తొలగించి భవనాన్ని నిర్మించారు. దానికి ప్రగతి భవన్ అని పేరు పెట్టారు. దీన్ని 2016 నవంబరు 23న ప్రారంభించారు. నియోక్లాసికల్, పల్లాడియన్ శైలిలో భారతీయ వాస్తుశిల్పి హఫీజ్ కాంట్రాక్టర్ ఆధ్వర్యంలో ప్రగతి భవన్ను నిర్మించారు. ఈ భవనం బ్రిటీషు రెసిడెన్సీ, ఫలక్నుమా ప్యాలెస్ వంటి కట్టడాలను పోలి ఉంటుంది. 2016 మార్చిలో ప్రగతి భవన్ నిర్మాణాన్ని ప్రారంభించారు. దీని కోసం 38కోట్లు ఖర్చు పెట్టారు. దీన్ని ముంబైకి చెందిన షాపూర్జీ పల్లోంజి నిర్మాణ సంస్థ నిర్మాణ కాంట్రాక్టర్. 9 ఎకరాల ఈ ప్రగతి భవన్ నిర్మించారు. ఇందులో ముఖ్యమంత్రి నివాసం, ముఖ్యమంత్రి కార్యాలయం, జనహిత పేరుతో సమావేశ మందిరం ఉన్నాయి. జనహిత అనేది 1000 మందికి పైగా కూర్చునే సామర్థ్యంతో కూడిన మీటింగ్ ఏరియా. తెలంగాణ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా 2017 ఫిబ్రవరి 17న దీన్ని ప్రారంభించారు. ఇక్కడ ముఖ్యమంత్రిని కలవడానికి వచ్చేవారితో సమావేశమవుతుంటారు. ఇందులో కార్యదర్శులు, కలెక్టర్లు, అధికారిక సమీక్షా సమావేశాలు, ప్రజా ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తారు. 2004లో నిర్మించిన ముఖ్యమంత్రి నివాసం, ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయాన్ని కాదని ముఖ్యమంత్రి కేసీఆర్, కొత్త ప్రగతి భవన్ నిర్మించుకున్నారు. పాతభవనాన్ని ఇన్స్పెక్టర్ జనరల్ (ఇంటెలిజెన్స్) కార్యాలయంగా ఉంది. అలాంటి భవనం రూపు రేఖలు మార్చేస్తున్నారు రేవంత్ రెడ్డి.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజే కెసిఆర్ పై ఫిర్యాదు

**జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 07 :**
తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు దీరిన రోజే మాజీ సీఎం కేసీఆర్కు షాక్ తగిలింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో జరిగిన అవినీతి పై సమగ్ర దర్యాప్తు జరి పించాలని తెలంగాణ హైకోర్టు న్యాయవాది రాపోల్ భాస్కర్ ఏసీబీకి ఫిర్యాదు చేశారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, పోలవరం కాంట్రాక్టర్ మెఘా కృష్ణారెడ్డి, ఇంజనీర్ ఇన్ చీఫ్ వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. తాగు, సాగు నీటి ప్రాజెక్టు పేరుతో కాళేశ్వరం ప్రాజెక్టు లో భారీగా ఆర్థిక అవతవ కలు జరిగాయని, నకిలీ ఎస్టిమేషన్ల ద్వారా వేలాది కోట్ల ప్రజాధనం దోపిడీకి గురైందని ఆరోపించారు. తెలంగాణ ప్రాంతంలోని ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్, వరంగల్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాలకు తాగునీరు, సాగునీరు అందించేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లోనే నిర్ణయం జరిగిందన్నారు. మొత్తం ప్రాజెక్టు పనులు 7 లింకుల కింద 228 ప్యాకేజీలు నాటి ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని అయితే పనులు జరుగుతున్న సమయంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ముఖ్యమంత్రిగా కేసీఆర్, మంత్రులుగా హరీష్ రావు, కేటీఆర్, ఎంపీగా కవిత ఎన్నికయ్యారని.. ఆ తర్వాత వీరంతా ప్రాజెక్టు అలైన్మెంట్లు, డిజైన్లు మార్చి వేసి కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిని, అంచనాలను పెంచారని ఆరోపించారు. మొత్తంగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పేరుతో వేల కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని దోచుకోవాలని ప్రణాళిక రచించారని దీనిపై కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరారు. కాగా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోగా, అన్నారం బ్యారేజీ వద్ద లీకులు కనిపించాయి. ఈ నేపథ్యంలో కాళేశ్వరం పేరుతో కేసీఆర్ భారీ ఎత్తున అవినీతికి పాల్పడ్డారని ఆరోపించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలిరోజే ఏసీబీకి ఈ ఫిర్యాదు రావడంతో ఎటువంటి చర్యలు ఉండబోతున్నాయనేది ఉత్కంఠగా మారింది..





# జనం మెచ్చిన నేత బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, కాప్రా :**
ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుభాకాంక్షలు తెలిపిన పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు. సైనిక్ పూరి లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం లో నూతనంగా ఎన్నికైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపేందుకు గురువారం మూడవరోజు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలు కాలనీల సంక్షేమ సంఘం సభ్యులు, అభిమానులు, ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్దకు భారీగా చేరుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. మీ అభిమానం, మీ ప్రేమ ఎల్లవేళలా ఇలాగే ఉండాలన్నారు.





ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పేదల పెన్నిధి బండారి లక్ష్మారెడ్డి అన్నగారినీ, ఈరోజు బిఆర్ఎస్ నాయకులు కొంపెల్లి రవీందర్ ముదిరాజ్, మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పోన్నే బోయిన సుధాకర్ ముదిరాజ్, ఎక్కల్ దేవి నరసింహాలు ముదిరాజ్, బోయిని ప్రభాకర్ ముదిరాజ్, బిఆర్ఎస్ నాయకులు పాల్గొనడం జరిగింది.

**జయభేరి, ఉప్పల్**



ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే గా భారీ మెజార్టీతో గెలుపొందిన శుభసందర్భంగా బండారి లక్ష్మారెడ్డి అన్న కు శుభాకాంక్షలు తెలియజేసిన ఉప్పల్ బిఆర్ఎస్ నాయకులు, నాయకురాళ్లు బిఆర్ఎస్ సీనియర్ నాయకురాలు రాణిరెడ్డి పూడూరు, జితేందర్ రెడ్డి, గుత్తా శివారెడ్డి, ఆనంతుల నర్సింహో, శాగా వెంకటేష్, కిరణ్ కుమార్, హేమలత గౌడ్, ప్రభావతి యాదవ్, మరియా, ఉష తదితరులు పాల్గొన్నారు.

**జయభేరి, ఉప్పల్**



# ఉచిత వైద్య శిబిరాలు పేదలకు వరం

- **ఉచిత వైద్య శిబిరాలను అందరు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సింగం ఆంజనేయులు**

**జయభేరి, డిసెంబర్ 7:**
మూడు చింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో సర్పంచ్ ఆంజనేయులు ఆధ్వర్యంలో మెడిసిటీ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వైద్యులు గ్రామస్తులకు బిపి , షుగర్ , కంటి, ముక్కు గొంతు, వరిబిజము, గడ్డలు , థైరాయిడ్, గర్భసంచి కి సంబందించిన వాటితో పాటు మోకాళ్ళ నొప్పులు ,నడుము నొప్పులు , ఊపిరితిత్తుల పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు . అనంతరం ఆపరేషన్ అవసరం ఉన్న వారిని మెడిసిటీ ఆసుపత్రికి తరలించి ఉచిత ఆపరేషన్లు చేయడం జరుగుతుందని మెడిసిటి హాస్పిటల్ వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఇమ్రాన్ ,శిరీష ,రవిబాబు ,కృష్ణ మార్కెటింగ్ ఇంచార్జ్ కుమార్ స్వామి, నాగార్జున, బాలకృష్ణ మీరా, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభాత జయభేరి
jayabheridaily.com


# సీతక్క

## జనం ప్రేమ గెలుచుకున్న కొండ దొరసాని



జయభేరి, హైదరాబాద్ :

ఆదివాసీ సమూహాలలో ఇప్పటికీ చాలావరకు మాత్రుస్వామిక కుటుంబ వ్యవస్థ తాలూకు లక్షణాలు కొనసాగుతున్నాయి. వాటిలో 'కోయ' తెగ ఆదివాసీ తెగ మాతృస్వామిక సంస్కృతికి ఒక ఆదిమ జాడ వంటిది. అమ్మాయి ఇతర కులం అబ్బాయిని పెళ్లి చేసుకుంటే అతని నాలుకమీద కాల్చిన ఇనపకడ్డీతో వాత పెట్టి, అల్లుడికి తమ ఇంటిపేరు ఇచ్చినాకగానీ వాళ్ళు అతన్ని ఇంట్లోకి రానివ్వరు... అటువంటి తెగలో పుట్టిన ఆమె ఓ కొండ దొరసాని... ఆదివాసుల సాధికారతను కాలరాసిన మధ్యయుగాలనాటి రాజ్య దురహంకారంమీద వీరోచితంగా పోరాడి తమ స్వాభిమానాన్ని చాటిన సమ్మక్క, సారలమ్మల పోరు వారసత్వం ఆమెది. ఆమె 'రణధీర' తనకి యుద్ధం కొత్త కాదు, ధిక్కారం తన రక్తంలోనే వారసత్వంగా తెచ్చుకుంది. అందుకే చిన్నతనంలో కత్తిపట్టి అడవి బాట పట్టినా ఎమ్మెల్యే అయ్యాక తన మనుషుల ఆకలి తీర్చడానికి కొండలు కోనలు దాటినా జనం కోసమే ఆమె పేరు 'ధనసరి అనసూయ' అలియాస్ 'సీతక్క'. అడవిలో పుట్టి అడవిలో పెరిగిన సీతక్కకి కష్టాలు, కడగండ్ల గురించి పుస్తకాలలో చదవాల్సిన పనిలేదు. గ్రంథాలయాలలో వుండే పుస్తకాలకు మించిన జ్ఞానం



ఆమెకి అనుభవాలనుంచి అబ్బింది. పట్టణాలకు, గ్రామాలకు దూరంగా విసిరేసిన కోయ గూడెంలో అరకొర సౌకర్యాలు, అగచాట్లమధ్య పెరిగిన తనకి ఆకలి రుచి తెలుసు. అలాగే, సాయుధ దళాలలో అడవి లోతట్టు ప్రాంతాలలో తిరుగుతున్నప్పుడు కనీసం తినడానికి తిండి, తాగడానికి మంచినీరు కూడా లేక పస్తులతో నడిచినరోజులు, పాచి పట్టిన అన్నాన్ని ఎండబెట్టుకుని తిన్నరోజులూ తెలుసు. అడవిలో దొరికే ఆకూ, అలమా ఏరుకొచ్చుకుని, పోడు వ్యవసాయంలో పండిన రాగిగింజలతో అంబలి కాసుకుతాగే ధనసరి సమ్మక్క, సమ్మయ్యల రెండవ సంతానం 'అనసూయ'. తనకంటే ముందు అన్న 'సాంబయ్య' వున్నాడు. సమ్మక్క, సమ్మయ్యల బిడ్డగా మొదలైన అనసూయ 'సీతక్క' గా మారడం వెనకవున్నది బతుకునుంచి వచ్చిన తిరగబడే తత్వమే వుమ్మడి వరంగల్ జిల్లా, (ప్రస్తుత ములుగు జిల్లా) ములుగు మండలం, జగ్గన్నపేటలో పుట్టింది. అటవీ గ్రామమైన తమ గూడెంకి తరచూ 'అన్నలు' వచ్చి కరపత్రాలు పంచి, పాటలు పాడి, జనానికి దొరల దౌర్జన్యాలను ప్రశ్నించే చైతన్యాన్ని అందించేవారు. అనసూయ మేనమామ ఆమె బాల్యంలోనే అన్నలలో కలసిపోయాడు. ఆమె అన్న 'సాంబయ్య' కూడా జనశక్తి పార్టీ కొరియర్ గా వున్నాడు. హైస్కూలు రోజులనుంచే విద్యార్థి ఉద్యమాలలో క్రియాశీలకంగా వుండే అనసూయ పదో తరగతి అయ్యాక జనశక్తి పార్టీ వుద్యమకారిణిగా సాయుధదళాలలోకి వెళ్ళింది. అక్కడే వుద్యమ తరగతులకు హాజరై సిద్ధాంతపరమైన పుస్తకాలు, సాహిత్యం చదివింది. ఆయుధాలు ఉపయోగించడం, దళాలను ఆర్గనైజ్ చెయ్యడంలో నేర్పుగలిగిన కార్యకర్తగా గుర్తింపు పొందడంతోపాటు తక్కువ సమయంలోనే దళ కమాండర్ స్థాయికి ఎదిగి మూడు జిల్లాలకు తన కార్యక్రమాలను విస్తరింపజేసింది. దళ కమాండర్ గా వున్నప్పుడు తన మారు పేరు 'రణధీర్'. నల్లగా, పొడుగ్గా, చలాకీగా ఖాకీ యూనిఫారంలో అచ్చం అబ్బాయిలాగే వుండేది. అయితే అక్కడ వుండే పితృస్వామిక ధోరణి 'రణధీర్' ని 'సీత'ని చేసింది. ఉద్యమ పెద్దలు 'కుంజా రాము' అనే నాయకుడితో పెళ్లి చెయ్యాలని నిర్ణయించి, పార్టీ పద్ధతుల్లోనే పెళ్లి జరిపినా, ఆ రాముడికి సహచరిగా ఆమె 'సీత', 'సీతక్క' అయ్యింది. ఖమ్మం జిల్లా కొత్తగూడెం వాడైన రాము కూడా కోయ జాతికి చెందిన తన దూరపు బంధువు కావడం విశేషం.

సీత గర్భవతిగా వున్నప్పుడు పోలీసులకి చిక్కి అరెస్టై, జైలు జీవితం గడిపింది. ప్రసవం సమయానికి బైటికొచ్చి పుట్టిన రెండునెలల బాబుని బంధువులకు అప్పగించి మళ్ళీ రసహ్య జీవితంలోకి వెళ్ళింది. తర్వాత బంధువుల నుంచి బాబుని ఆమె తల్లి తీసుకెళ్ళి పెంచి హాస్టల్ లో చేర్చింది. సుమారు ఎనిమిదేళ్ళు జనశక్తి నక్సలైట్ గా, దళ కమాండర్ గా వుద్యమానికి అంకితమై చావైనా, బతుకైనా జనం కోసమే అనుకున్న సీతక్కకి పార్టీలో ఏర్పడిన సిద్ధాంతపరమైన విభేదాలు, చీలికలు ఆమెని జనజీవన స్రవంతి లోకిరాక తప్పనిస్థితి కలిగించాయి. ఈలోపల తనభర్త రాముతో కూడా విభేదాలు వచ్చి విడిపోయింది. రాము జనశక్తి పార్టీలోనే కొనసాగి కొన్నాళ్ళ తర్వాత ఎన్కౌంటర్ లో చనిపోయాడు. తన ఉద్యమ సహచరులంతా తలోదారి చూసుకున్నప్పుడు సీతక్క కూడా బైటికొచ్చి మధ్యలో ఆగిపోయిన చదువుని కొనసాగించింది. హైదరాబాద్ లో ఒక చిన్న రూమ్ తీసుకుని ఐదు సంవత్సరాల L.L.B పూర్తి చేసింది. తన ఖర్చులు, చదువు కోసం ఆదివాసుల సమస్యలమీద పనిచేసే 'యక్షి' అనే ఒక ఎన్.జి.ఓలో వుద్యోగంలో చేరింది. నక్సలైట్ గా తెలంగాణలో బాగా గుర్తింపు పొందిన సీతక్క బైట 'లా' స్టూడెంట్ 'ధనసరి అనసూయ'గా మళ్ళీ రహస్య జీవితం గడపాల్సి వచ్చింది. అయినా పాత కేసులు ఆమెని ప్రశాంతంగా బతకనివ్వలేదు. ఎప్పుడుబడితే అప్పుడు పోలీసు స్టేషన్లకి పిలిపించేవారు. ఒకవైపు ఆర్థిక ఇబ్బందులు, మరోవైపు కేసులు... ఈ పరిస్థితుల్లో తెలుగుదేశం పార్టీలో చేరాల్సిందిగా ఆ పార్టీ అధిష్టానం నుంచి వచ్చిన పిలుపు ఆమె రాజకీయాలను అనూహ్యమైన మలుపు తిప్పాయి. 'లా' పూర్తయ్యాక వరంగల్ వెళ్లి గతంలో తన కేసులు వాదించిన సీనియర్ అడ్వకేట్, వెంకటస్వామి రెడ్డి గారి దగ్గర జూనియర్ లాయర్ గా చేరి కొన్ని నెలలు పనిచేశాక 2004 ఎలక్షన్లకు ముందు కొందరు మిత్రుల ప్రోద్బలంతో ప్రత్యక్ష రాజకీయాలలోకి ప్రవేశించింది. ఆ బూర్జువా పార్టీకి కూడా జన సామాన్యంలో పాపులారిటీ వున్న 'సీతక్క' అనే మాజీ నక్సలైట్ ఇమేజ్ మీదనే మక్కువ కాబట్టి మళ్ళీ 'ధనసరి అనసూయ' ప్రజా నాయకురాలు 'సీతక్క' అయ్యింది. తెలుగుదేశం పార్టీ(TDP) తరపున పోటీ చెయ్యడానికి పార్టీలో ఎప్పటినుంచో కొనసాగుతున్నా సీటు దక్కని వాళ్ళున్నప్పటికీ ప్రజాజీవితంలో మమేకమై గుర్తింపు పొందిన సీతక్కకి ములుగు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ (TDP)అభ్యర్థిగా వుమ్మడి వరంగల్ జిల్లాలో షెడ్యూలు ట్రైబ్స్ కి రిజర్వు అయిన ములుగు అసెంబ్లీ నియోజకవర్గం సీటురావడం సులభతరం అయింది. కానీ, 2004 లో రాజశేఖర్ రెడ్డి ప్రభావంతో ఆమె కాంగ్రెస్ అభ్యర్థి 'మోదం వీరయ్య' చేతిలో ఓడిపోయింది. అయినప్పటికీ ఆమె వెనుకంజ వెయ్యకుండా అటు జనంలోనూ, ఇటు పార్టీలోనూ తన ప్రభావం పెంచుకుంటూ 2009 అసెంబ్లీ ఎన్నికల్లో అదే మోదం వీరయ్య మీద బంపర్ మెజారిటీ తో గెలిచింది. అయితే అప్పటికే మలి దశ తెలంగాణా ఉద్యమం ఊపందుకుంది. తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ తమ పార్టీ ఓడిపోవడంతో ప్రజలకు సీతక్క ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే స్థితి లేకపోగా తాను తెలంగాణా బిడ్డగా తన ఆంధ్రా పార్టీ అభీష్టానికి వ్యతిరేకంగా తెలంగాణా ఉద్యమానికి సంఘీభావం ప్రకటించాల్సి రావడం ఆమెని తీవ్ర ఘర్షణకు లోను చేసింది. అయినప్పటికీ తన తెలంగాణా అస్తిత్వ ప్రకటన చేస్తూ కాకతీయ యూనివర్సిటీ విద్యార్థుల సమ్మెకి మద్దతు పలికి వారితో పాటు ఎనిమిది రోజుల ఆమరణ నిరాహార దీక్ష లో పాల్గొని అరెస్టై రెండు రోజులు జైలు శిక్ష అనుభవించింది. 2014 లో వుమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయి ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పడినా సీతక్క తెలుగుదేశం పార్టీలో వుండడం వలన ఆమెకి రాజకీయ లబ్ది జరగలేదు. తెలంగాణా రాష్ట్రంలో తెలుగు దేశం పార్టీ తన అస్తిత్వాన్ని కోల్పోయింది. ఈ క్రమంలోనే

సీతక్క చైతన్యవంతమైన సాహిత్యాన్ని చదవడమేకాక 'వెన్నెల' అనే కలం పేరుతో కవిత్వం రాసేది. 'యక్షి' అనే సంస్థలో పనిచేస్తున్నపుడు ఆదివాసీల ఉనికి మీద వ్యాసాలు కూడా రాసింది. 'వన్ ఆఫ్ సెవెంటీ' చట్టంమీద, ఆదివాసుల హక్కులమీద ఆలోచనాత్మకమైన వ్యాసాలు, కవితలు రాసింది. ఆమెకి కష్టపడి పనిచెయ్యడం ముందునుంచీ అలవాటే నక్సలైట్ గా బైటికొచ్చి హైదరాబాద్ లో చదువు కొనసాగించేటప్పుడుకూడా తన సొంత ఊరెళ్ళి తునికాకు పనికి, వ్యవసాయ పనులకి వెళ్లి వచ్చిన కూలి డబ్బులతో ఫీజులు కట్టుకునేది. బాబు 'సూర్య' ని కష్టపడి ఎం.టెక్ దాకా చదివించింది, తనుకూడా తల్లి కష్టం చూసి బాగా పట్టుదలతో చదివి నాగపూర్ ట్రిపుల్ ఐటి లో సీటు తెచ్చుకున్నాడు. ప్రత్యక్ష రాజకీయాలలోకి వచ్చాక సీతక్క ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పొలిటికల్లో సైన్స్ లో ఎమ్మె పూర్తిచేసి ఇప్పుడు అదే యూనివర్సిటీలో గొత్తికోయలీ వనప్రమాణాలుస్థితిగతులమీద పీహెచ్.డీ చేస్తుంది. సీతక్కది అచ్చమైన ఆదివాసీ స్వాభిమానం, స్వయం పాలనని, స్వేచ్ఛని ప్రేమించేగుణం. నగరంలో వుండి ఎమ్మె, ఎల్.ఎల్.బి చేసినా, ఎమెల్యే అయినా ఆదివాసి సంస్కృతి అంటే తనకి సహజాతంలా వచ్చిన ప్రేమ వెలిసిపోలేదు.

ఆమెకి కాంగ్రెస్ పార్టీ నుంచి ఒకవైపు, తెలంగాణా రాష్ట్ర సమితి (TRS)నుంచి ఒకవైపు ఆహ్వానాలు రావడం, ఆమె తెలంగాణాని ఇచ్చిందనే అభిమానం వల్ల, TDP రేవంత్ రెడ్డి కుటుంబంతో సీతక్కకి వున్న సాన్నిహిత్యం వల్ల ఆమె కాంగ్రెస్ పార్టీవైపే మొగ్గుచూపింది. మళ్ళీ ములుగు నియోజకవర్గం నుంచే కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఈసారి కాంగ్రెస్ ప్రభావం తగ్గిపోవడం వలన తన ప్రత్యర్థి TRS అభ్యర్థి చందూలాల్ చేతిలో ఓడిపోయి 2018 అసెంబ్లీ ఎన్నికలలో అదే చందూలాల్ మీద కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచి రెండోసారి ఎమ్మెల్యే అయింది సీతక్క. మొదట తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలి స్థాయికి ఎదిగిన ఆమె తర్వాత కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై జన బాహుళ్యంలో గొప్ప ప్రాబల్యం, చరిష్మా కలిగిన నాయకురాలిగా, తనపార్టీలోనేకాక తెలంగాణా రాష్ట్రంలోనే ఒక ప్రజామోదం పొందిన మేటి నాయకురాలిగా గుర్తింపు పొందుతుంది.

ఆమె విప్లవ పార్టీలో నక్సలైట్ గా సీతక్క బాగా సాహసోపేతమైన నాయకురాలిగా, రెబల్ గా పేరుతెచ్చుకుంది. తన నాయకత్వంలోని దళం ఆడవాళ్ళమీద దౌర్జన్యాలు చేసే మగ వర్గశత్రువులకు మర్మాంగాలను తెగ్గోయడం, గుండు కొట్టించి ఊరేగించడం వంటి శిక్షలు విధించేవారు. ప్రత్యక్ష రాజకీయాలలోకి వచ్చాక ప్రతిపక్ష పార్టీలో ఉన్నప్పటికీ ఆదివాసుల సమ్మక్క, సారలమ్మ దేవతల మేడారం జాతరలో కోయ తెగవారికి భాగస్వామ్యం లేకపోవడంపై ప్రభుత్వ అధికారులతో చర్చించి ఆదేవతల వారసులకు జాతరలో చోటు కల్పించడానికి కృషి చేసి సాధించింది. అలాగే ఆదివాసుల స్వయం ప్రతిపత్తికి సంబంధించిన 'వన్ ఆఫ్ సెవెంటీ' చట్టంపై అసెంబ్లీలో తరచుగా ఆలోచనాత్మకమైన చర్చ లేవనెత్తుతూ వస్తుంది. ఆదివాసీ తెగల ప్రధాన సమస్యలైన మౌలిక వసతులు లేకపోవడంపైన అసెంబ్లీలో గళమెత్తింది. ఆదివాసులు నివసించే అటవీ ప్రాంతంలో రవాణా సౌకర్యాలు, రోడ్లు, మంచినీరు, పాఠశాలలు, హాస్పటళ్ళు లేకపోవడం పైన ఆమె నిత్యం అధికారులతో చర్చించి కొంతమేరకు సాధించగలిగింది. అడవి లోపల గూడేలలో జీవించేవారికి రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు లేకపోవడంపై ఆమె ఆందోళన చేస్తుంది. తెలంగాణా రాష్ట్రం వస్తే అన్ని సమస్యలు పరిష్కారమౌతాయని ప్రజలకు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన అధికార పార్టీ రాష్ట్రం ఇచ్చిన వారితోపాటు ప్రజల్ని కూడా వంచించి తమ కుటుంబ పాలనని కొనసాగిస్తున్నదని సీతక్క ఆరోపణ. నీళ్ళు, నిధులు, నియామకాలు వస్తాయని చెప్పే ముఖ్యమంత్రి, ఆయన సహచర మంత్రులు వాటిని గాలికి వదిలెయ్యడమే కాక ప్రజా సమస్యలమీద మాట్లాడేవారిని నేరస్తులని చేసి శిక్షిస్తున్నారని, హైదరాబాద్ లో ఒకప్పుడు ప్రజలు తమ నిరసనని వ్యక్తం చేసుకునే ధర్నా చౌక్ కూడా లేకుండా పోవడమే ఆ పరిస్థితికి చక్కటి తార్కాణం అని ఆరోపిస్తుంది. ప్రజలు ఆశించిన తెలంగాణా రాలేదని, ఇది దొరల పాలన అని ఆమె విమర్శ. కరోనా వైరస్ ప్రపంచాన్ని వణికిస్తున్నా ఇక్కడి పాలకులు ప్రజలకు కనీసం మాస్కులు కూడా పంపిణీ చెయ్యడం లేదని, బైట వ్యాపారులు మాస్కులను అధికరేట్లకు అమ్ముతున్నారని అసెంబ్లీలో సీతక్క మాట్లాడినప్పుడు ముఖ్యమంత్రి ఇంతమంది మంత్రులకు లేనిబాధ ఈమెకెందుకని ఆమె మాటలకు ఎగతాళిగా నవ్వి హేళన చేసి నప్పుడు సీతక్క అవమానంగా భావించింది. మాస్కులతోపాటు బియ్యం, కూరగాయలు, నూనె సబ్బులు ట్రాక్టర్, జీపులలో వేసుకుని అటవీ ప్రాంతంలో వెళ్ళగలిగినంత మేరకు వాహనాలలో వెళ్లి ఇంకా లోతట్టు గూడేలకు తన సహచరులతోపాటు స్వయంగా తానుకూడా సరుకుల మూటలు మోస్తూ ఎగుడు దిగుడు అడవి బాటల్లో, వాగులు, వంకలు దాటుకుని వెళ్తుంది. అడవి బిడ్డలకు పౌష్టికా హారం గురించి, కరోనా వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన పరిశుభ్రతలను వివరిస్తుంది. ఆడవాళ్ళను, పిల్లలను కూర్చోబెట్టుకుని నేను కూడా ఇటువంటు గూడేలలో సరైన తిండి, వసతి లేకుండా పెరిగినదాన్నే అని వారిలో ఒకదానిగా వివరిస్తుంది సీతక్క. సీతక్క అంటే ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి కనీస సౌకర్యాలకు నోచుకోని అభం శుభం తెలియని ఆదివాసీ ప్రజలకు తమజాతిలోంచి ఉద్భవించిన ఒక మణి మాణిక్యం. రెండేళ్లకోసారి వచ్చే వనదేవతల మేడారం జాతరతోపాటు ఆదివాసుల గూడేలలో జరిగే పండగ పబ్బాలకు, శుభకార్యాలకు, చావులకు ఆమె తప్పకుండా హాజరవ్వడమే కాక వారి సంస్కృతిలో భాగమైన ఆట, పాటలలో పాల్గొంటుంది. పెళ్ళికి, చావుకీ తప్పనిసరిగా మోగే డోలు వాయిద్యమంటే ఆమెకి ఇష్టం, డోలు శబ్దం వినగానే అప్రయత్నంగానే తనకాళ్ళు చిందేస్తాయి. అందుకే, తన కొడుకు 'సూర్య' వివాహానికి చత్తీస్ ఘడ్ నుంచి డోలు వాయిద్యకారులైన గొత్తికోయలను పిలిపించింది. నక్సలైట్ గా తను తిరిగిన అటవీ గ్రామాలే కాదు, మైదాన ప్రాంతాలలో కూడా ప్రతి వూరు, పల్లె, వాగు, వంకా తనకి పరిచయమే. అగ్రకుల బూర్జువా పార్టీలలో చేరినప్పటికీ సీతక్క జనంతో తనకున్న ప్రత్యక్ష సంబంధాలను మాత్రం వదులుకోలేదు. ఆమెని తమ బిడ్డగా భావించే ములుగు ప్రాంతపు గ్రామాలలో ఆమె జనంలోకి చొచ్చుకుని పోతుంది. అందరితో ప్రేమగా వారి పరిస్థితులను లోపలి వ్యక్తిగా అర్థం చేసుకునే సీతక్కకి తనని ఎవరన్నా 'మేడం' అని సంబోధిస్తే ఇష్టం ఉండదు, 'మేడం' అంటే దూరం పెట్టినట్టుగా, 'అక్క' అంటే ఇంట్లోవాళ్ళం అన్నట్టు వుంటుంది అని తను కూడా తన పార్టీ కార్యకర్తలను, అనుచరులను 'అన్నా, అక్కా' అనే పిలుస్తుంది. తనకి మామూలు అర్థంలో దేవుడు, మతం అనేవాటిపైన నమ్మకం లేదు, గుళ్ళూ, గోపురాలకు వెళ్ళదు. కానీ, ఆదివాసీ అస్తిత్వాన్ని చాటే ఆదివాసుల పిత్రుదేవతారాధన, ప్రకృతికి సంబంధించిన జాతరలలో ఇష్టంగా పాల్గొంటుంది. సీతక్కది అసలైన ఆదివాసీ రూపం; నల్లని రంగుతో సాదాసీదా ముతక చీరలు కట్టుకుని జనంతో కలసిపోయే సీతక్క అంటే అడవి బిడ్డలకు ఒక సమ్మక్కనో, ఆమె బిడ్డ సారలమ్మనో చూసినట్టుంటుంది. జనం ప్రేమలను గెలుచుకున్న కోయ దొరసాని ఆమె. ఆమె ఆదివాసీ సాధికారతకు ప్రతీక, ముందునుంచీ స్వతంత్ర వ్యక్తిత్వం, ధైర్య సాహసాలు ఆమెకి పెట్టని ఆభరణాలు. తాను గన్ పట్టినా, గన్ మెన్ తో వున్నా ఆమెది పోరాట దృష్టే! ఒకపుడు తనవెంట పడిన పోలీసులు ఇప్పుడు తనకి రక్షణగా వెంట నడవడం చూసి నవ్వుకుంటుంది ఈ అడవి చుక్క. ఆమె మాటల్లోనే 'ఎన్నిసార్లు చంపినా మళ్ళీ మళ్ళీ పుట్టడం/ఎన్నిసార్లు పడినా మళ్ళీ మళ్ళీ లేచి నిలబడడం' ఆమె నైజం.

చల్లపల్లి స్వరూపరాణి



# జయభేరి సినిమా



## భర్త డైరెక్షన్‌లో జాన్వీ కపూర్.. హీరో ఎవరంటే..?

లేడి సూపర్ స్టార్ నయనతార జోరు మామూలుగా లేదు. ఇటీవలే షారుక్ ఖాన్ 'జవాన్'తో నేషనల్ వైడ్ బ్లాక్ బస్టర్‌ని అందుకున్న ఈ భామ.. తాజాగా 'అన్న పూరణి' సినిమాతో మరో బ్లాక్ బస్టర్ అందుకుంది. నయన్ కెరీర్‌లో 75వ సినిమాగా వచ్చిన ఈ సినిమాను నీలేష్ కృష్ణ దర్శకత్వం వహించాడు. ఇదిలా ఉంటే.. ఈ సూపర్ స్టార్ తాజాగా మరో కొత్త సినిమాతో వస్తుంది. అయితే ఈ సినిమాలో నయనతార ఓ యంగ్ హీరోకు అక్కగా నటించనున్నారట. తన భర్త విఘ్నేశ్ శివన్ డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో నయన్ సిస్టర్ రోల్ చేయబోతుంది. 'లవ్ టుడే' సినిమాతో సెన్సేషన్ క్రియేట్ చేసిన డైరెక్టర్ కమ్ హీరో ప్రదీప్ రంగనాథన్‌తో విఘ్నేశ్ శివన్ ప్రస్తుతం ఒక సినిమా చేయబోతున్నాడు. అయితే ఈ సినిమాలోనే ప్రదీప్‌కు అక్కగా నయనతార నటించనున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ స్టార్ జాన్వీ కపూర్ నటించనున్నట్లు సమాచారం. అయితే ఈ విషయంపై మూవీ మేకర్స్ ఇంకా అధికారిక అనౌన్స్‌మెంట్ చేయలేదు. మరోవైపు కమల్ హాసన్, మణిరత్నం కాంబోలో వస్తున్న తన డ్రీమ్ ప్రాజెక్ట్‌లో నటిస్తుంది నయనతార. అంతకుముందు విఘ్నేశ్ శివన్ డైరెక్షన్‌లో వచ్చిన నానుమ్ రౌడి ధాన్, కత్తువాకుల రెండు కాదల్ చిత్రాలలో నయనతార హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమాలు బాక్సాఫీస్ వద్ద హిట్గా నిలిచాయి.



## కల్యాణ్‌రామ్ 'డెవిల్' రిలీజ్ డేట్ ఎప్పుడంటే..?

బింబిసార లాంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత నందమూరి కల్యాణ్‌రామ్ నుంచి వస్తున్న తాజా చిత్రం డెవిల్. ది బ్రిటిష్ సీక్రెట్ ఏజెంట్ అనేది ఉపశీర్షిక. ఈ చిత్రానికి అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ మూవీ నుంచి లాంఛ్ చేసిన కల్యాణ్‌రామ్, మాళవిక నాయర్, ఎల్నాజ్ నొరౌజీ ఫస్ట్ లుక్ పోస్టర్‌లు.. నెట్టింట వైరల్ అవుతున్నాయి. అయితే ఈ మూవీ నుంచి కొన్నాళ్లుగా ఎలాంటి అప్‌డేట్స్ రాలేదు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన కొత్త న్యూస్ ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తున్న మూవీ లవర్స్ కోసం నయా అప్‌డేట్ బయటకు వచ్చింది. మొదట ఈ మూవీని నవంబర్ 24న విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేసిన విషయం తెలిసిందే. అయితే అనుకోని కారణాల వల్ల ఈ సినిమాని వాయిదా వేశారు. అయితే తాజాగా ఈ సినిమా విడుదల తేదీని మళ్లీ ప్రకటించారు మేకర్స్. ఈ సినిమాను డిసెంబర్ 29న పాన్ ఇండియా లెవల్లో విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.

## ఊరందరికీ మతిమరుపు వస్తే..

హరికృష్ణ, రామకృష్ణ, యాని, రేఖా నిరోషా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'తికమకతాండ'. వెంకట్ దర్శకత్వంలో తిరుపతి శ్రీనివాస రావు నిర్మించారు. ఈ నెల 15న విడుదలకానుంది. గురువారం ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఊరిలోని ప్రజలందరికీ మతిమరుపు వస్తే ఎలాంటి సంఘటనలు చోటుచేసుకుంటాయి? ఈ క్రమంలో పండే వినోదం ప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ఆద్యంతం నవ్వులు పంచే చిత్రమిది. వినూత్నమైన కాన్సెప్ట్‌తో ప్రేక్షకులకు కొత్త అనుభూతినందిస్తుంది' అన్నారు. 'ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించడమే లక్ష్యంగా ఈ సినిమా తీశాం. ప్రతి పాత్ర వినోదాన్ని పంచుతుంది' అని నిర్మాత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: హరికృష్ణన్, సంగీతం: సురేశ్ బొబ్బిలి, నిర్మాణం: టీఎస్ఆర్ మూవీ మేకర్స్.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Publishedat # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com